క్లుప్తంగా

బ్యాడ్మింటన్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలను అభినందిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనంజయరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పరిపాలన భవనంలోని మహిళా సిబ్బందికి నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలకు బుధవారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనంజయ రావు బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో 31 మంది మహిళా సిబ్బంది పాల్గొన్నారు. విజేతగా డిప్యూటీ రిజిస్ట్రార్ ఎల్.మంజుల, రమా దుర్గ టీమ్ నిలిచారు. ద్వితీయ స్థానంలో ఎస్.సునీత, వై.శివకుమారి, పి.దీపిక టీమ్, తృతీయ స్థానంలో సిహెచ్.జ్యోతికుమారి, మమత టీమ్‌లు నిలిచాయి. ఈ సందర్భంగా విజేతలను రిజిస్ట్రార్ అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఫైనాన్స్ ఆఫీసర్ వి.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి నిందితులకు రిమాండ్

ఆరిలోవ: ఆరిలోవ పోలీసులు ఇద్దరు గంజాయి నిందితులను బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఆరిలోవ ఎస్ఐ కృష్ణ తెలిపిన వివరాలిలా.. కొందరు వ్యక్తులు గంజాయితో విశాఖ వ్యాలీ స్కూల్ రోడ్డులో సాగర్‌నగర్ వైపు వెళ్తున్నట్లు మంగళవారం ఆరిలోవ పోలీసులకు సమాచారం అందింది. వారు అటుగా వెళ్లడంతో గంజాయి మూటలతో ఇద్దరు వ్యక్తులు రోడ్డు పక్కన కొండ వైపు చెట్లలోకి పారిపోయారు. వారిని వదలకుండా పోలీసులు వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. 2 కిలోల 300 గ్రాముల గంజాయి కలిగిన మూడు మూటలను స్వాధీనం చేసుకున్నారు. వారిని ఏఎస్సార్ జిల్లా అరకు ప్రాంతానికి చెందిన మజ్జి అప్పన్న, విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన కాకర సుభాష్ చక్రవర్తిగా గుర్తించారు. నిందితులను బుధవారం కోర్టులో హాజరు పరచగా.. న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ కృష్ణ తెలిపారు. వారిద్దరినీ విశాఖ కేంద్ర కారాగారానికి రిమాండ్‌కు తరలించామన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఎంవీపీకాలనీ: జాలరిపేట శ్మశానవాటిక సమీపంలో గంజాయి విక్రయిస్తున్న జ్యోతి రఘునాథ్ అనే వ్యక్తిని ఎంవీపీ పోలీసులు అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాలిలా.. విశ్వసనీయ సమాచారంతో ఎస్ఐ ధనుంజయ్ నాయుడు జాలరిపేట శ్మశానవాటిక వద్దకు వెళ్లగా.. రఘునాథ్ ఎస్ఐను, పోలీస్ సిబ్బందిని చూసి చేతిలోని కవర్ బ్యాగ్ వదిలేసి పరారయ్యే ప్రయత్నం చేశాడు. అతడిని వారు వెంబడించి పట్టుకున్నారు. తాను డ్రైవర్‌గా నగరంలో పనిచేస్తున్నానని, డబ్బులకు ఆశపడి అప్పుడప్పుడు గంజాయి విక్రయిస్తున్నట్లు రఘునాథ్ పేర్కొన్నాడు. పాడేరు నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్నట్లు తెలిపాడు. ఈ క్రమంలో అతడి నుంచి 2.2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

ముడసర్లోవ వద్ద రైల్వే జోన్ పనులు



రైల్వే జోన్ పనులు జరుగుతున్న దృశ్యం

ఆరిలోవ: ముడసర్లోవ వద్ద రైల్వే జోన్ పనులు జరుగుతున్నాయి. ఇక్కడ సుమారు 56 ఎకరాల భూమిని రైల్వే జోన్ కోసం కేటాయించిన విషయం తెలిసిందే. రెండు నెలల కిందట ఈ స్థలాన్ని చదును చేసి భూ పరీక్షలు(సోయిల్ టెస్టింగ్) చేపట్టారు. అనంతరం నిర్మాణ పనులు ప్రారంభించారు. కొద్ది రోజులుగా నిర్మాణానికి అవసరమైన సామగ్రి సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఇసుక, పిక్క, ఇటుకలు తదితర సామగ్రి నిల్వ చేశారు. ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది కోసం ప్రత్యేకంగా గదులు నిర్మించారు. ప్రాజెక్టుకు సంబంధించిన భవన నిర్మాణాల కోసం యంత్రాలతో పనులు చేయిస్తున్నారు. ఒకప్పుడు నిర్మానుష్యంగా ఉండే ఈ ప్రాంతం.. భారీ యంత్రాలు, లారీలు, పనులు చేసే కూలీలతో సందడిగా మారింది.

నేడు హనుమజ్జయంతి

మహారాణిపేట: టౌన్ మెయిన్ రోడ్డులోని శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవాలయంలో గురువారం హనుమజ్జయంతి నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి స్వామివారికి పంచామృతాభిషేకం, ఆకు పూజ, సింధూర పూజలు జరుగుతాయని దేవాలయ ఈవో అల్లు జగన్నాథం ఒక ప్రకటనలో తెలిపారు.

అస్తవ్యస్తంగా రహదారులు



అంబేడ్కర్ కాలనీలో అధ్వానంగా రహదారి

- రోడ్లు తవ్వారు.. మరమ్మతులు మరిచారు
- గోతుల దారుల్లో ప్రయాణికుల తంటాలు
- 15, 23 వార్డుల్లో ఇదీ పరిస్థితి



కేఆర్ఎం కాలనీ తెలుగుతల్లి జంక్షన్‌లో గోతులు పూడ్చని రహదారి



జేఆర్ నగర్‌లో తవ్వి వదిలేసిన రోడ్డు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15, 23 వార్డుల్లో ఎక్కడికక్కడ అస్తవ్యస్త రహదారులే దర్శనమిస్తున్నాయి. భూగర్భ డ్రైనేజీ, పైప్‌లైన్, కేబుల్ పనుల నిమిత్తం ఇక్కడ తవ్విన రోడ్లకు నేటికీ మరమ్మతులు చేపట్టలేదు. ఏమాత్రం వర్షం పడినా.. గోతుల రహదారులపై ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. గోతులు పూడ్చకపోవడంతో గాయాల బారిన పడుతున్నామని స్థానికులు, వాహన చోదకులు గగ్గోలు పెడుతున్నారు.

చినుకు పడితే బురదమయం..

23వ వార్డులోని కేఆర్ఎం కాలనీలోని గణేష్‌నగర్ రోడ్డు మధ్యలో భూగర్భ డ్రైనేజీ పనుల కోసం తవ్విన గోతులను సక్రమంగా పూడ్చలేదు. గోతులతో పాటు రాళ్లు తేలిన రోడ్డుపై రాకపోకలకు స్థానికులు, వాహన చోదకులు నానా అవస్థలు పడుతున్నారు. చినుక పడితే ఈ రోడ్డు బురదమయంగా మారుతోంది. కేఆర్ఎం కాలనీ 60 ఫీట్ రోడ్డు తెలుగుతల్లి విగ్రహం జంక్షన్ వద్ద రహదారి పరిస్థితీ ఇలానే ఉంది. ఇక్కడ రోడ్డు మధ్యలో గోతులు తవ్వేసి మరమ్మతులు చేయలేదు. గోతులమయంగా తయారైన ఈ రోడ్డుపై రాకపోకలు ఇబ్బందికరంగా మారాయి. ఈ వార్డులో తవ్వి వదిలేసిన



గణేష్‌నగర్‌లో గోతులమయంగా రోడ్డు

రోడ్లకు తక్షణం మరమ్మతులు చేయాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

రాకపోకలకు ఇబ్బందులు

జీవీఎంసీ 15వ వార్డులోని పలు ప్రాంతాల్లో రోడ్లను తవ్వి వదిలేయడంతో రాకపోకలకు స్థానికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇసుకతోట అంబేడ్కర్ కాలనీ నుంచి జేఆర్ నగర్‌కు వెళ్లే మార్గంలోని రహదారులను పైప్‌లైన్, కేబుల్ పనుల నిమిత్తం తవ్వేశారు. దీంతో ఈ రోడ్లన్నీ గోతులతో నిండిపోయాయి. వాహన చోదకులు ఇక్కట్లకు గురవుతున్నారు. ఏమాత్రం వర్షం పడినా గోతుల రహదారులు చిత్తడిగా మారుతుండటంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ పనులు సకాలంలో పూర్తి చేయకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. త్వరగా పనులు పూర్తిచేయాలని, తవ్విన రోడ్లను బాగుచేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సకాలంలో రోడ్లు బాగుచేయాలి

మా కాలనీలో కేబుల్ పనుల నిమిత్తం రహదారుల్లో తవ్విన గోతులను సకాలంలో పూడ్చాలి. ఈ రోడ్లపై రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. వెంటనే రోడ్లు బాగుచేయాలి.

– ఎస్.వెంకటరావు, జేఆర్ నగర్

వర్షంతో రోడ్లు బురదమయం

తవ్విన రోడ్లపై తారు వేయకపోవడంతో వర్షం పడితే చాలు బురదమయంగా మారతున్నాయి. ఈ సమయంలో రాకపోకలు సాగించాలంటే సాహసం చేయాల్సి వస్తోంది. అధికారులు వేగంగా పనులు పూర్తిచేయాలి.

వి.ఎస్.మూర్తి, అంబేడ్కర్ కాలనీ

గోతులమయం

బీచ్‌రోడ్డు: నగరంలో ఎక్కడా లేని విధంగా విద్యుత్ కాంతుల మధ్య పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ దేవస్థానం వద్ద రహదారి నిర్మించారు. ఆలయం నుంచి వీఎంఆర్‌డీఏ పార్క్‌కు వెళ్లే రోడ్డు అది. ఏడాది కూడా పూర్తి కాకుండానే ఈ రోడ్డులో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. చూసేందుకు ఎంతో అందంగా.. ఆకర్షణీయంగా ఉండే ఈ రహదారిలోని గోతుల వల్ల వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుకు తక్షణం మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.





పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ - వీఎంఆర్‌డీఏ పార్క్ రహదారిలో గోతులు

దివ్యాంగ బాలలను భవిత కేంద్రంలో చేర్చండి

ఆరిలోవ: ప్రత్యేక అవసరాలు గల పిల్లలను (దివ్యాంగులు) భవిత కేంద్రంలో చేర్పించాలని వారి తల్లిదండ్రులకు చినగదిలి మండల ఎంఈవో అనురాధ సూచించారు. సర్వ శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి చినగదిలి మండల పరిధిలో దివ్యాంగ పిల్లల సర్వే జరుగుతోంది. ఇందులో భాగంగా తోటగరువు ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్ర టీచర్లతో కలిసి ఎంఈవో అనురాధ బుధవారం ఆరిలోవ ప్రాంతంలో సర్వే చేశారు. ముగ్గురు ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి, భవిత కేంద్రంలో చేర్పించారు. వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలను గుర్తించే సర్వే జూన్ 9 వరకు కొనసాగుతుందన్నారు. భవిత సెంటర్‌లో అందిస్తున్న సేవలను సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. టీచర్లు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారన్నారు. పిల్లలకు ఫిజియోథెరపీ నిర్వహించి, వారి ప్రవర్తనలో మంచి మార్పు తీసుకొస్తారన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను చేర్పించడానికి 83097 21261 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. భవిత కేంద్రం టీచర్ షేక్ సలీమా తదితరులు పాల్గొన్నారు.



భవిత కేంద్రంలో చేర్చిన దివ్యాంగ బాలుడితో మాట్లాడుతున్న ఎంఈవో అనురాధ

జూలో ఉత్సాహంగా సమ్మర్ క్యాంప్



సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న చిన్నారులతో జూ అధికారులు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో బుధవారం పాఠశాల పిల్లలకు సమ్మర్ క్యాంప్ ప్రారంభమైంది. జూ పార్కుతోపాటు జీవీఎంసీ, వైల్డ్‌లైఫ్ కన్సర్వేషన్ త్రూ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్, గ్రీన్ పాజ్, యూత్ కన్సర్వేషన్ యాక్షన్ నెట్‌వర్క్ సంయుక్తంగా ఈ క్యాంప్ నిర్వహిస్తున్నాయి. ఐదు రోజుల పాటు జరగనున్న ఈ శిబిరంలో నగరంలో పలు పాఠశాలలకు చెందిన సుమారు 30 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటి రోజు వారికి పక్షుల వీక్షణ నిర్వహించారు. జూలో ఉన్న పక్షులతో పాటు లోపల సహజ వాతావరణంలో చెట్లపై తిరిగే వివిధ రకాల పక్షులను పిల్లలు తిలకించారు. వాటి గురించి జూ ఎడ్యుకేషన్ సిబ్బంది చిన్నారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ జి.మంగమ్మ మాట్లాడుతూ పిల్లలకు వన్యప్రాణులపై అవగాహన కల్పించడానికి సమ్మర్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేసవి సెలవుల్లో పిల్లలు ఇలాంటి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వన్యప్రాణులు, వాటి జీవిత విశేషాలు, ఆహార అలవాట్లు, పర్యావరణానికి వాటి ఉపయోగం తదితర అంశాల గురించి పిల్లలకు అవగాహన కల్పిస్తామన్నారు. జూలో వన్యప్రాణులను ఏవిధంగా సంరక్షిస్తున్నాం, వాటికి అందిస్తున్న ఆహారం, వైద్య సేవల గురించి వివరిస్తామని చెప్పారు. శిబిరంలో పాల్గొన్న పిల్లలకు జూ టీషర్ట్‌లు, టోపీలు అందించారు. వాటిని ధరించిన పిల్లలు హుషారుగా బర్డ్ వాచ్ చేశారు. కార్యక్రమంలో జూ అధికారులు, క్యాంప్ నిర్వాహకులు పాల్గొన్నారు.



జూ పార్కులో బర్డ్ వాచ్ చేస్తున్న చిన్నారులు

ఖాళీ స్థలం కనిపిస్తే ఆక్రమణే..

- ప్రభుత్వ స్థలంలో దర్జాగా ఇంటి నిర్మాణం
- పట్టించుకోని సంబంధిత అధికారులు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు ఎస్ఎస్ఎన్ నగర్‌లోని ప్రభుత్వానికి చెందిన ఖాళీ స్థలంలో ఓ వ్యక్తి ఇల్లు నిర్మిస్తున్నాడు. ఈ స్థల విక్రయం ఇప్పటికే ఇద్దరు వ్యక్తుల చేతులు మారింది. బీఆర్‌టీఎస్ నిర్మాణంలో నివాసాలు కోల్పోయిన 228 మంది రామకృష్ణాపురం గ్రామస్తులకు జీవీఎంసీ ఇక్కడ లేఅవుట్ వేసి సెంటు చొప్పున ఇంటి స్థలాలు కేటాయించింది. వాటితోపాటు జీవీఎంసీ అధికారులు మరో 10 మందికి కొన్నాళ్ల తర్వాత కేటాయించారు. అనధికారికంగా సుమారు మరో 30 స్థలాలు ఆక్రమించి కాలనీ సంఘం పెద్దలే విక్రయాలు జరిపించేశారు. ఇలాంటి కోవలోనే ఇటీవల సుమారు 100 చదరపు గజాల ఖాళీ స్థలాన్ని ఆక్రమించి ఓ వ్యక్తికి విక్రయించేశారు. దీని విలువ సుమారు రూ.40 లక్షలకు పైగా ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు. సదరు వ్యక్తి సంఘ పెద్దలు, టీడీపీ వార్డు నాయకుల సమక్షంలో మరో వ్యక్తికి స్థలం విక్రయించినట్లు తెలిసింది. ఇటీవల కొనుగోలు చేసిన వ్యక్తి ప్రభుత్వ స్థలంలో దర్జాగా ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు.

టీడీపీ నాయకుల సహకారంతోనే..

వార్డులో టీడీపీ నాయకులే నేరుగా సచివాలయ సిబ్బందికి చెప్పి ఎమ్మెల్యే నిర్మించుకోమన్నారని, దాని జోలికి వెళ్లొద్దంటూ హుకుం జారీ చేసినట్లు తెలిసింది. దీంతో ఇక్కడ జరుగుతున్న ఆక్రమణ, అక్రమ నిర్మాణం గురించి సచివాలయ సెక్రటరీ, టౌన్ ప్లానింగ్ టీపీవో, ఏసీపీ దృష్టికి తీసుకువెళ్లినా.. పట్టించుకోకపోవడం విశేషం. ఇలాంటి ఆక్రమణలకు స్థానిక ఎమ్మెల్యే కొమ్ము కాయడం, టీడీపీ నాయకులు బరితెగించి ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు సహకారం అందిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎస్ఎస్ఎన్ నగర్‌లో సంఘం పెద్దలు కూడా ఇక్కడ లేఅవుట్‌లో కేటాయించని స్థలాల క్రయ విక్రయాలు దర్జాగా జరిపేస్తున్నారంటున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు కూడా సంఘం పెద్దలకు సహకరిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



13వ వార్డు ఎస్ఎస్ఎన్ నగర్‌లోని ఆక్రమిత స్థలంలో నిర్మిస్తున్న ఇల్లు

సుకుమారన్ మృతికి సీపీఐ నివాళి



సుకుమారన్ (ఫైల్)

ఎంవీపీకాలనీ: సీపీఐ నగర మాజీ కార్యవర్గ సభ్యుడు, ఇస్కఫ్ జాతీయ నాయకుడు టి.ఎస్.సుకుమారన్(76) మృతికి సీపీఐ నాయకులు సంతాపం తెలిపారు. అనారోగ్యం కారణంగా మంగళవారం ఆయన మరణించారు. ఎంవీపీ కాలనీలోని ఆయన నివాసంలో భౌతిక కాయం వద్ద బుధవారం సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు మరపిళ్ల పైడిరాజు, జిల్లా కార్యదర్శి ఎస్‌కే రెహమాన్ తదితరుల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ అయిన సుకుమారన్ ఉద్యోగి గానే కాకుండా సీపీఐలో పలు పదవులను సమర్థంగా నిర్వర్తించి వన్నె తెచ్చారన్నారు. నిబద్ధత గల వ్యక్తిగా మంచి గుర్తింపు పొందారని సీపీఐ నేతలు కొనియాడారు. సుకుమారన్ మరణం పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో విశాఖ కో–ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు రాఘవేంద్రరావు, ఆచార్య కె.ఎస్.చలం, సీపీఐ, ఇస్కఫ్ నాయకులు పాల్గొన్నారు.

నిత్యం మురుగు నీటి ప్రవాహం

ఏయూక్యాంపస్: నిత్యం వేలాది లీటర్ల మురుగు నీరు యథేచ్ఛగా సముద్రంలోకి ప్రవహిస్తోంది. పాండురంగాపురం చేరువలో గెడ్డ నుంచి మురుగు నీరు నేరుగా సాగరంలోకి కలుస్తోంది. సమీపంలోనే పలువురు పర్యాటకులు స్నానాలు సైతం చేస్తున్నారు. సముద్రపు నీటిలో మురుగు నీరు కలుస్తోందనే విషయం వారికి తెలియదు. ఇసుక తిన్నెలపై నడుచుకుని వెళ్లాలని ఆశపడే వారు ఈ మురుగు నీటి నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. దీనికి తగిన పరిష్కారం చూపాలని పర్యావరణవేత్తలు సైతం కోరుతున్నారు. నేరుగా మురుగు నీరు నిత్యం సాగరంలో కలవడం వల్ల సముద్ర జీవులకు సైతం ముప్పు వాటిల్లే అవకాశముంది. జీవీఎంసీ అధికారులు దృష్టి సారించి మురుగు నీరు సముద్రంలోకి వెళ్లకుండా ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని పలువురు సూచిస్తున్నారు.



సముద్రంలోకి ప్రవహిస్తున్న మురుగు నీరు

జిల్లా ప్రజా రవాణాధికారికి ప్రశంసాపత్రం

దాబాగార్డెన్స్: అధిక ఇంధన పొదుపు చేయడం, అత్యుత్తమంగా బస్సులు నడపడంలో జిల్లా ప్రజా రవాణాధికారి బి.అప్పలనాయుడుకు ప్రశంసలు అందుకున్నారు. ఏపీఎస్‌ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమల రావు నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్(ఇంజినీరింగ్, పరిపాలన విభాగాలు), ప్రాంతీయ మేనేజర్లు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న జిల్లా ప్రజా రవాణాధికారి అప్పలనాయుడు

దళితులపై దాడులు అమానుషం

దాబాగార్డెన్స్: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వంలో దళితులపై నానాటికీ దాడులు పెచ్చుమీరుతున్నాయని, ఇది ఆగేదెప్పుడని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం విశాఖ జిల్లా ప్రశ్నించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చాక దళితులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ జగదాంబ సమీపంలోని సిటు కార్యాలయంలో బుధవారం సంఘం జిల్లా కమిటీ మీడియా సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దెల సుబ్బన్న, ఉపాధ్యక్షుడు వై.రాజు మాట్లాడుతూ నెల్లూరు జిల్లా గూడూరు మండలం దప్పలంపాడులో దళితులపై సాంఘిక బహిష్కరణ, తిరుపతిలో దళిత విద్యార్థి జేమ్స్‌ను చిత్ర హింసలు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ నెల 18న అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం దొంకాడ గ్రామంలో టెంట్ హౌస్ పనులు చేసుకుంటున్న దళితుల్ని సెల్‌ఫోన్ దొంగతనం పేరిట కొట్టడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధోరణి మారకపోతే, దళితులు, అభ్యుదయ వాదులు, మేధావులు, ప్రజాతంత్రవాదులందర్నీ ఐక్య పరచి నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

వీఎంఆర్‌డీఏ పార్క్‌కు నూతన సొబగులు

- అభివృద్ధి పనుల ప్రారంభం
- పాత వాటి నిర్వహణ గాలికి..

ఏయూక్యాంపస్: బీచ్ రోడ్డులోని వీఎంఆర్‌డీఏ పార్క్‌లో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రధానంగా పార్క్‌లోని అంతర్గత నడక మార్గాల్లో కొన్నింటిని మార్పు చేస్తున్నారు. ఇక్కడ రహదారులు దెబ్బతినడంతో నిత్యం వాకింగ్‌కు వచ్చే వారికి కొంత ఇబ్బంది ఎదురవుతోంది. దీనిని గుర్తించిన అధికారులు కొన్ని నడక దారుల్లో పేరుకున్న వ్యర్థాలు, మట్టిని తొలగించి, వాటి స్థానంలో కొత్త మట్టి నింపుతున్నారు. నడకకు అనుకూలంగా ఉండేలా నూతన మార్గాలను తీర్చిదిద్దుతున్నారు. ఈ పార్క్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న బోటింగ్ ఏరియాతోపాటు ఇతర ప్రాంతాల్లో వర్షపు నీటిని, వ్యర్థ జలాలను బయటకు పంపడానికి వీలుగా నూతనంగా ఒక భారీ కాలువను తవ్వుతున్నారు. పార్క్‌లో ఏర్పడే వ్యర్థ జలాలు సముద్రం వైపుగా పంపేలా భారీ కాలువ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం వీటి పనులు జోరుగా జరుగుతున్నాయి.

కళతప్పిన స్థూపం పరిసరాలు

అభివృద్ధి పనులు చేపడుతున్న సమయంలో పార్క్‌లో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్న పలు ప్రాంతాలను అధికారులు విస్మరిస్తున్నారు. పార్క్‌లోకి ప్రవేశించగానే అందరినీ ఆకట్టుకునే కళాత్మక స్థూపం వంటి నిర్మాణం ఉంది. ఇక్కడ అధిక శాతం మంది ఫొటోలు తీసుకునేందుకు ఆసక్తి చూపుతారు. ఈ స్థూపం చుట్టూ ఉన్న పరిసరాలను పచ్చని గడ్డితో పాటు వివిధ రకాల రాళ్లు, ఇతర పదార్థాలతో ఆకర్షణీయంగా గతంలో తీర్చిదిద్దారు. ప్రస్తుతం దీని చుట్టూ ఉన్న గడ్డి ఎండిపోయే స్థితిలో ఉంది. చుట్టూ నిర్మించిన ప్రాంతంలో సిమెంట్ రాళ్లు, ఇతర వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. దీంతో సాయంత్రం వేళలో పార్క్‌కు వచ్చే సందర్శకులకు కొంత నిరాశ ఎదురవుతోంది. ఈ స్థూపం చుట్టూ చేపట్టిన నిర్మాణాల్లో గ్రానైట్ పలకలు దెబ్బతినడం, విరిగిపోవడం, ఊడిపోవడం జరిగాయి. వీటన్నింటినీ పరిశీలించి అధికారులు మరమ్మతులు చేసి సుందరంగా తీర్చిదిద్దాలని సందర్శకులు కోరుతున్నారు.



వీఎంఆర్‌డీఏ పార్క్‌లో మురుగునీరు పోవడానికి నిర్మిస్తున్న కాలువ



పార్క్‌లో తీర్చిదిద్దుతున్న నడక దారి



కళావిహీనంగా స్థూపం ప్రాంగణం

కొండలను ముద్దాడిన మబ్బులు



రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాతావరణం కాస్త చల్లబడింది. ఆరిలోవ ప్రాంతం చుట్టూ కొండలు ఉండటంతో బుధవారం వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. ఉదయం, సాయంత్రం వర్షం జల్లులు కురిసిన సమయంలో నల్లని మేఘాలు కమ్మేశాయి. చుట్టూ కొండలను తాకుతున్నట్లున్న మేఘాలు చూపరులకు ఆనందాన్ని పంచాయి.

– ఆరిలోవ